క్లుప్తంగా

ఘనంగా కల్యాణోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని శ్రీసీతారామాలయంలో ఆలయ 10వ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సుముహూర్తంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం సీతారాముల విగ్రహాలను పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, గురుప్రసాద్, రమణయ్య, సురేష్ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల గ్రామోత్సవం

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో శుక్రవారం సీతారాముల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా ఐదు రోజులుగా ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి రోజూ రామాలయ సన్నిధిలో ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి ప్రత్యేక పూజలు జరిపారు. చివరి రోజైన శుక్రవారం ప్రత్యేక అలంకరణలో పల్లకిలో కొలువుదీరిన సీతారాముల గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాత్యాయని కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వెంకటరమణారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

16 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని వాసుదేవాపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన 16 క్వింటాళ్ల బియ్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ శివన్న, సివిల్ సప్లై డీటీ మల్లిఖార్జున తెలిపారు. గ్రామం వెలుపల నరేంద్ర రేకుల షెడ్డులో అక్రమంగా బియ్యం నిల్వ ఉంచిన సమాచారం రావడంతో వాటిని తనిఖీ చేసి సీజ్ చేశామన్నారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు వారు చెప్పారు. ఈ దాడుల్లో ఏఓ బాలగంగాధర్, కార్యక్రమంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహేంద్రనాథ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ వల్లి, వీఆర్ఓ రాజశేఖర రెడ్డి పాల్గొన్నారు.

నాడు ప్రభుత్వ పాఠశాల.. నేడు బజ్జీల సెంటర్

ప్రొద్దుటూరు : మండలంలోని చెన్నమరాజుపల్లెలో గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో భాగంగా నూతన పాఠశాల భవనం నిర్మించారని.. నేడు ఆ పాఠశాల బజ్జీల సెంటర్‌గా మారుతోందని పాఠశాల పేరెంట్స్ కమిటీ మాజీ చైర్మన్ నశ్యం భాస్కర్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎంఈఓ సావిత్రమ్మ, ఎంపీడీఓ కార్యాలయ ఏఓకు ఆయన వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఊరికి మధ్యలో నాడు-నేడు పథకం కింద గత ప్రభుత్వంలో నూతన పాఠశాల భవనం నిర్మించారన్నారు. పాఠశాల భవనం ఉపయోగంలోకి రాకపోవడంతో కొందరు ప్రైవేటు వ్యక్తులు వ్యాపారాలకు అడ్డాగా ఈ భవనం మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి ఈ భవనాలను ఉపయోగంలోకి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నశ్యం రవి, మేడం ఏసుదాసు, మేడం అజరయ్య పాల్గొన్నారు.

వీహెచ్‌పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

బద్వేలు అర్బన్ : బద్వేలు, గోపవరం మండలాలకు సంబంధించిన విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం స్థానిక సరస్వతి శిశు మందిరంలో బద్వేలు ఖండ ఆర్‌ఎస్‌ఎస్ చాలక్ రామకోటిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఇందులో వీహెచ్‌పీఎస్ బద్వేలు మండల అధ్యక్షుడుగా పెరుగు వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా పెద్ది సుధాకర్, గంగన్నపల్లి మురళి, కార్యదర్శిగా సుబ్బరాజు, కోశాధికారిగా బాషికాల శ్రీనివాసులు, భజరంగ్‌దళ్ ప్రముఖ్‌గా ఉలవకట్ల వెంకటేష్, గోపవరం మండల అధ్యక్షుడుగా పత్తిపాటి నరసింహులు, ఉపాధ్యక్షులుగా తిరుపాలయ్య, శ్రీనివాసులు, కార్యదర్శిగా వేణుయాదవ్, సహ కార్యదర్శిగా రాజేష్, కోశాధికారిగా మధుబాబు, భజరంగ్‌దళ్ ప్రముఖ్‌గా సురేష్‌రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వీహెచ్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి సుభాష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

షాకీర్ హుస్సేన్‌కు బెస్ట్ సర్వీస్ అవార్డు



బెస్ట్ సర్వీస్ అవార్డు అందుకుంటున్న షాకీర్

ప్రొద్దుటూరు : పట్టణానికి చెందిన ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్‌కు చిత్తూరులో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు అందించారు. షాకీర్ హుస్సేన్ అందిస్తున్న సేవలను గుర్తించి ఆయనను ఫౌండేషన్ ప్రతినిధి సోమలరాజు అవార్డు అందించి శాలువా కప్పి సత్కరించారు.

బీమాపై సడలుతున్న ధీమా!

- అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- నష్టపరిహారం అందించాలని రైతుల వినతి



అకాలవర్షానికి దెబ్బతిన్న అరటి పంట (ఫైల్)



అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పంట (ఫైల్)

కాశినాయన : బీమా అంటే రక్షణ. కష్టకాలంలో ఆదుకుంటుందని నమ్మకం. ఈ నమ్మకాన్ని వమ్ము చేసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నదాతలు మండిపడుతున్నారు. పంటల బీమాతో రైతుల్లో సందిగ్ధత నెలకొంది. వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. దీంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

ఆరుగాలం కష్టపడి పండించే అన్నదాతకు అడుగడుగునా అవాంతరాలే. చీడపీడలు, నకిలీ పురుగు మందులు, నకిలీ విత్తనాలు, అతివృష్టి, అనావృష్టి రైతన్నకు అవరోధాలుగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో పంటలు నష్టపోతే ఆయా సీజన్‌లలో పంట నష్టపరిహారం అందేది. గత ప్రభుత్వ హయాంలో అమలైన పంటల బీమా స్థానంలో రైతులకు మరింత ప్రయోజనం కలిగించేలా మెరుగైన పథకాన్ని తెస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించినా ఇంత వరకు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొత్త పథకంపై అధ్యయనానికి ముగ్గురు మంత్రులతో కమిటీ వేశారు. ఆ కమిటీ నివేదిక ఇచ్చినా ఉత్తర్వులు కార్యాచరణకు రాలేదు. పంటల బీమా వస్తుందా లేక మళ్లీ 2019కు ముందు పరిస్థితులే వస్తాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కాలయాపన ఎందుకు

ప్రకృతి వైపరీత్యాలు, విపత్తుల కారణంగా పంటలు నాశనమై రైతు నష్టపోయేవాడు. చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడిన సందర్భాలను 2019కి ముందు వరుసగా చూశారు. ఇలాంటి విపత్తుల నుంచి అన్నదాతను ఆదుకునేందుకు వారికి అండగా నిలిచేందుకు నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకం తీసుకువచ్చింది. ప్రతి ఏడాది పంట వేసినప్పుడే ఇ-క్రాప్ బుకింగ్ చేసి రైతు నష్టపోకుండా జగన్ సర్కారు అండగా నిలిచింది. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరి పది నెలలు దాటింది. రబీ సీజన్ కూడా ముగుస్తోంది. పంట రుణాల రెన్యువల్ ప్రక్రియ ముగిసింది. సకాలంలో బీమా ప్రీమియం చెల్లించకపోతే ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులు పరిహారం పొందే అవకాశం కోల్పోతారు. అయితే సాధారణంగా రెన్యువల్ సమయంలోనే బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. కానీ రెన్యువల్ ముగిసిన తర్వాత కూడా పంటల బీమాపై మంత్రులతో త్రిసభ్య కమిటీ వేసి రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. 2024 - 25 సంవత్సరానికి సంబంధించి విధి విధానాలను కూటమి ప్రభుత్వం ఖరారు చేయాల్సి ఉంది.

రైతులపై భారం పడకూడదని

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రైతులపై ప్రీమియం భారం పడకుండా ఉచిత పంటల బీమా అమలు చేసింది. 2014 - 2019 వరకు చంద్రబాబు హయాంలో మాదిరిగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నియోజకవర్గంలోని కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, అట్లూరు మండలాల్లో 70 వేల ఎకరాల సాగు భూమి ఉంది. రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు నియోజకవర్గంలో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి. కాశినాయన మండలంలో 450 ఎకరాల్లో అరటి, 80 ఎకరాల్లో వరి, 150 ఎకరాల్లో సజ్జ పంట పూర్తిగా దెబ్బతింది. ఉద్యాన, వ్యవసాయాధికారులు పంట పొలాలను పరిశీలించి ప్రాథమిక నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపామని చెబుతున్నారు. ఎప్పుడు నష్టపరిహారం అందజేస్తామనే దానిపై స్పష్టత ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

13న బండినరవలో నందీశ్వరాలయ భూమిపూజ

పోరుమామిళ్ల : పట్టణానికి 3 కిలోమీటర్ల దూరంలో టేకూరుపేట రహదారిలో బండినరవ ప్రాంతంలో 108 శివలింగాలతో శ్రీ నందీశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి ఈనెల 13న ఆదివారం ఉదయం భూమి పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కలిగించే విధంగా ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో శ్రీరామస్వామి ఆలయం, అయ్యప్పస్వామి ఆలయం, శ్రీకృష్ణ మందిరం నిర్మించడంతో పాటు కొండపైన భవ్యమైన అభయాంజనేయస్వామి భారీ విగ్రహం, కింద కోనేరు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. కసుమళ్ల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న భూమిపూజ కార్యక్రమంలో అచలానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానందస్వామి పాల్గొంటారన్నారు.

అకాల వర్షం.. దెబ్బతిన్న వరి పంట



చెంచుపల్లెలో పడిపోయిన వరి పంట

చాపాడు : మండల వ్యాప్తంగా గురువారం రాత్రి కురిసిన అకాల వర్షంతో వరి పంటలు దెబ్బతిన్నాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు వీచడంతో 20 రోజుల్లో చేతికందాల్సిన వరి పైర్లు నేలకొరిగాయి. మండలంలోని చెంచుపల్లెలో సానేపల్లె నరసింహారెడ్డి, కృష్ణారెడ్డి, చిన్న పెంచల్‌రెడ్డి, సుబ్బిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, చల్లా వెంకటలక్షుమ్మ, రామసుబ్బమ్మ, గంగాధర్, పెద్దగంగన్న, రామకృష్ణారెడ్డి, లక్షుమ్మలకు చెందిన 80 ఎకరాల్లో సాగైన వరి పంట మొత్తం నేలకొరిగి పడిపోయిందని వారు వాపోయారు. ఈ గ్రామంతో పాటు మండలంలోని మడూరు, చిన్నవరదాయపల్లె, అన్నవరం, చియ్యపాడు, గుంతచీపాడు, తిమ్మాయపల్లె, అయ్యవారిపల్లె తదితర గ్రామాలలో వరి పంటలు దెబ్బతిన్నాయి. అకాల వర్షంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు వాపోతున్నారు.

మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా చదువుకోవాలి



మాట్లాడుతున్న కోయంబత్తూరు శ్రీ కాలేజ్ అసోసియేట్ ప్రొఫెసర్ ఓస్వాల్డ్ మనోజ్

చాపాడు : ప్రస్తుత కాలంలో రోజు రోజుకు మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలని కోయంబత్తూరు శ్రీకృష్ణ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఓస్వాల్డ్ మనోజ్ పేర్కొన్నారు. స్థానిక చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(సీబీఐటీ)కాలేజీలో శుక్రవారం సీఎస్ఈ, అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో రెండో రోజు అవిన్యా 2కె25 నేషనల్ లెవల్ సింపోయిజమ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన అసోసియేట్ ప్రొఫెసర్ మాట్లాడుతూ ఈ రోజుల్లో చాలా రకాలైన టెక్నాలజీలు అందుబాటులో ఉన్నాయని వీటికి అనుగుణంగా బీటెక్ ఫస్టియర్ నుంచే చదుకోవాలన్నారు. విభాగం, వాటి అనుబంధ విభాగాల కార్యక్రమాలలో విద్యార్థులు ఫస్టియర్ నుంచే పాల్గొనాలని చదువు ముగిసే లోగా ప్రావీణ్యం పొందుతారన్నారు. దీని ద్వారా ఉద్యోగ ఎంపికల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. సీబీఐటీ చైర్మన్ డా.వి.జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ కాలేజీలలో చదువుతో పాటు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాల ద్వారా విద్యార్థులు చాలా విషయాలు తెలుసుకుని ఇతరులతో ఎలా మెలగాలో అర్థం చేసుకుంటారనారు. అనంతరం సీఎస్ఈ, అనుబంధ విభాగాలలో నిర్వహించిన ఈవెంట్స్‌లలో ప్రతిభ చాటిన విద్యార్థులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఈ విభాగాధిపతి దశరథరామిరెడ్డి, సీబీఐటీ ప్రిన్సిపాల్ ఎస్.శృతి, డైరెక్టర్ అడ్మిన్ జి.శ్రీనివాసుల రెడ్డి, అనుబంధ విభాగాధిపతులు శ్రీనివాసులరెడ్డి, కృపాసాగర్‌రెడ్డి, మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు



ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో గేటు వద్ద ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.జనార్దన్‌రావు, డిపో సెక్రటరీ చంద్రయ్యలు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ కార్డు బదులు పాత పద్ధతిలో సీలింగ్ లేని వైద్య సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే అక్రమ సస్పెన్షన్లు, అక్రమ రిమూవల్స్ ఆపడంతో పాటు నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని కోరారు. ఉద్యోగులకు అత్యవసర సమయాల్లో మూడు రోజులు సెలవు ఇవ్వడంతో పాటు మహిళలకు చైల్డ్‌కేర్ లీవ్‌ల మంజూరులో జరుగుతున్న జాప్యాన్ని నివారించాలని కోరారు. కార్యక్రమంలో సీసీఎస్ డెలిగేట్ మల్లికార్జున, అసోసియేషన్ సంయుక్త కార్యదర్శులు శ్రీధర్, రమణ, ఆర్.బి.రెడ్డి, నాయకులు భాస్కర్, ఎం.ఎస్.రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మైదుకూరు : ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మైదుకూరు ఆర్టీసీ డిపోలో శుక్రవారం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) ఆధ్వర్యంలో ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్ఎంయూఏ నాయకులు వీఎస్ నాయుడు తదితరులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎంతో కాలం నుంచి కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఉద్యోగుల భద్రతకు సంబంధించిన సర్క్యులర్ 1/2019ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్‌లు, రిమూవల్స్‌ను వెంటనే ఆపాలని కోరారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ డిపో ప్రెసిడెంట్ ఎస్.నాగరాజు, గ్యారేజ్ సెక్రటరీ వైఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాలంకరణలో ఆలయం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఘనంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం సైకత లింగానికి, రాజరాజేశ్వరి అమ్మవారికి, చండీ మాతకు విశేష అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. కలశస్థాపన, గణపతి పూజ, సాయంత్రం ధ్వజారోహణం, రాత్రి ఎదుర్కోళ్ల ఉత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శనివారం సాయంత్రం గంగారాజరాజేశ్వరి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ రాజారెడ్డి తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

తేలికపాటి వర్షం.. ఉప్పొంగిన డ్రైనేజీ



ఆంజనేయనగర్‌లోని కొండారెడ్డివీధిలో..



ఆర్టీసీ బస్టాండులోని కాలువలో చెత్త వ్యర్థాలు

బద్వేలు అర్బన్ : పట్టణంలో గురువారం రాత్రి కురిసిన తేలికపాటి వర్షానికే పలు ప్రాంతాలోల డ్రైనేజీలు ఉప్పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరింది. పట్టణంలోని మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డు, ఆంజనేయ నగర్, రామాంజనేయ నగర్, శాస్త్రి నగర్, మహబూబ్ నగర్ తదితర ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక కొద్దిసేపు కురిసిన వర్షానికే రహదారులపై నీరు నిలుచింది. అలానే మైదుకూరు రోడ్డులో భారీగా వర్షపునీరు నిలిచి ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే పట్టణంలోని పలు నివాస ప్రాంతాలలో భారీగా వర్షపు నీరు చేరింది. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీల్లో చెత్త నిల్వలు పేరుకుపోవడంతో మురుగునీరంతా రోడ్లపైకి చేరింది.

పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించాలి



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీఓ సావిత్రమ్మ

దువ్వూరు : పిల్లల పోషణ పట్ల జాగ్రత్త వహించడంతో పాటు ఆరోగ్యకరమైన అలవాట్లు ఉండేలా చూడాలని తెలిపారు. శుక్రవారం దువ్వూరు అంగన్‌వాడీ కేంద్రం -7లో, గుడిపాడు సెక్టార్ పరిధిలోని సంగటితిమ్మాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ సావిత్రమ్మ మాట్లాడుతూ గర్భధారణ మొదలు బిడ్డకు రెండేళ్ల వయసు వరకు అత్యంత ముఖ్యమైన సమయం అన్నారు. వెయ్యి రోజులలో బిడ్డ మెదడు 80 శాతం అభివృద్ధి చెందుతుందన్నారు. పిల్లలలో రోగ నిరోధక శక్తి, ఎదుగుదల, బిడ్డ సమగ్రాభివృద్ధి ఈ రోజుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నారు. 18 ఏళ్లు నిండిన తర్వాతే పెళ్లి చేయాలని సూచించారు. గర్భం ధరించిన తర్వాత ఐరన్, ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న పాలకూర, గోంగూర వంటి ఆకు కూరాలు, కాయగూరలు, గుడ్లు, మాంసం, పాలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈనెల 22వ తేదీ వరకు పోషకాహార పక్షోత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దువ్వూరు అంగన్‌వాడీ కేంద్రం-7లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సంగటితిమ్మాయపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్ వైజర్ సౌజన్య, ఐటీసీ కోఆర్డినేటర్ స్వరూప, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగసముద్రం చెరువు ఆక్రమణలు తొలగించాలి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల చెరువు ఒరవ నీటిపై ఆధారపడి శతాబ్దాలుగా ఆయకట్టుకు నీరందిస్తున్న రంగసముద్రం చెరువు ఆక్రమణదారుల కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతున్నదని నీటిసంఘం అధ్యక్షుడు వీరచెంద్రాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయనతో పాటు 8వ టీసీ మెంబర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ సర్వే నెంబర్ 217లో 46 ఎకరాలు, 226లో 135 ఎకరాలు, 227లో 41 ఎకరాలు, 916లో 41 ఎకరాల విస్తీర్ణంలో ఆనాడు చెరువు నిర్మాణం జరిగిందన్నారు. అయితే ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు చెరువును ఆక్రమించుకున్నారన్నారు. చెరువులో అక్రమంగా పట్టాలు పొందగా కలెక్టర్ రద్దు చేశారన్నారు. ఆక్రమణల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టలేదన్నారు. చెరువు ఆక్రమణలు తొలగించి, చెరువులో నీరు నిలువ ఉండేలా చర్యలు తీసుకోవాలని, భూగర్భ జలాలు పెరిగి బోర్లకు నీరందేలా చూడాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రొద్దుటూరు : పట్టణ, మండల పరిధిలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వీజీ శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 132 కేవీ ప్రొద్దుటూరు సబ్ స్టేషన్ పరిధిలో, 33 కేవీ ఐడీఏ ఫీడర్, 33 కేవీ మార్కెట్ యార్డు ఫీడర్, 33 కేవీ ప్రొద్దుటూరు టౌన్ ఫీడర్, 33 కేవీ మోడంపల్లి ఫీడర్, పలు 11 కేవీ ఫీడర్లు పరిధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మెయింటెనెన్స్ పనులు వల్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డీఈఈ రవి చంద్రశేఖర్, ఏఈఈ వెంకట మహేష్ తెలిపారు.

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే



ప్రొద్దుటూరు : జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్



పోరుమామిళ్ల : పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



ప్రొద్దుటూరు కల్చరల్ : నివాళి అర్పిస్తున్న బీసీ సమాఖ్య, బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు



బద్వేల్ అర్బన్ : పూలే విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీసీ, ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు : గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండలంలోని పశువైద్య కళాశాలలో శుక్రవారం పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

- నందినీ క్లాత్ మార్కెట్‌లోని మహాజన రాష్ట్ర సమితి కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, ఎర్రన్న, నారాయణ, నాగ సబ్బరాయుడు, చంద్ర, ప్రసాద్, యల్లయ్య, రంగన్న, నగేష్, ప్రసాద్, ఆమెన్, బాషా తదితరులు పాల్గొన్నారు.
- పూలే జయంతి సందర్భంగా మైదుకూరు రోడ్డులోని ఆయన విగ్రహానికి అంబేడ్కర్ సేన రాష్ట్ర కన్వీనర్ దప్పెళ్ల దేవదాసు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్‌బీ సాగర్ పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ సోమా లక్ష్మీనరసయ్య మైదుకూరు రోడ్డులోని పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీసీ సమాఖ్య సహ అధ్యక్షుడు సందు శివనారాయణ, కోశాధికారి రామసుబ్బయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర సెక్రటరీ జనరల్ బీవీ రాజు, జిల్లా అధ్యక్షుడు జింకా జయప్రకాష్, నాయకులు లక్ష్మీదేవి, విజయకుమార్, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

- బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, ఉపాధ్యక్షులు ప్రతాప్‌నాయుడు, జీసీ పుల్లయ్య, సంయుక్త కార్యదర్శి శ్రీనివాసులు, మల్లికార్జున, చౌడయ్య తదితరులు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
- విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఏపీ ఎమ్మార్పీఎస్ కడప ఇన్‌చార్జి గడ్డం నరసింహా, పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు, బయన్న దాసు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని పూలే విగ్రహం వద్ద నివాళి అర్పించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట కృష్ణయ్య, గౌరవ సలహాదారుడు నాగమల్ల శంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు దేవానంద్, లక్ష్మీనారాయణ, వెంకటరాముడు, సుబ్బరామయ్య యాదవ్, సుబ్బరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విప్లవమూర్తి జ్యోతిరావుపూలే

బద్వేలు అర్బన్ : సమాజంలో మార్పు కోసం కృషి చేసిన సామాజిక విప్లవమూర్తి మహాత్మా జ్యోతిరావు పూలే అని పూలే విగ్రహ నిర్మాణ కమిటీ చైర్మన్ బి.గురుమూర్తి, మున్సిపల్ వైస్ చైర్మన్, పూలే ఉత్సవ కమిటీ చైర్మన్ వై.గోపాలస్వామిలు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సిద్ధవటం రోడ్డులోని పూలే, సావిత్రి బాయిపూలే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బద్వేలు పట్టణాభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కోశాధికారి శ్రీనివాసులరెడ్డి, ఆర్ఎఫ్ఆర్‌టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, సంఘమిత్ర చైర్మన్ సొద్దల పెంచలయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుబాన్‌బీ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రమణయాదవ్, సీనియర్ దళిత నాయకులు ఓ.ఎస్.వి.ప్రసాద్, కేశవయ్య, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

పూలే జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి బ్రహ్మయ్య, అసోసియేట్ అధ్యక్షుడు జి.పుల్లయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిచ్చయ్య, గౌరవాధ్యక్షుడు పుల్లంరాజు, నాయకులు ప్రసాద్, సుబ్బరాయుడు, చెన్నరాయుడు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో..

పూలే జయంతి సందర్భంగా శుక్రవారం దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక సిద్ధవటం రోడ్డులోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇమ్మానుయేల్, కార్యనిర్వాహక కార్యదర్శి పి.వెంకటరమణ, నాయకులు సుధాకర్, రాజశేఖర్, ప్రసాద్, రామకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యాలయంలో..

పోరుమామిళ్ల : సామాజికవేత్త, ఉద్యమకారుడు, సంఘ సేవకుడు జ్యోతిరావు గోవిందరావు పూలే చిన్నప్పుడే మానవ హక్కుల ప్రాథమిక సూత్రాలపై జ్ఞానాన్ని సంపాదించారని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రాంతీయ కార్యాలయంలో పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత పూలే

పోరుమామిళ్ల : నిమ్న వర్గాల అభ్యున్నతి, మహిళల విద్య, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం జీవితాన్నే ధారపోసిన గొప్ప సంఘ సంస్కర్త, స్ఫూర్తి ప్రదాత మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి. రమణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పూలే జయంతి సందర్భంగా పోరుమామిళ్లలోని ఎస్టీయూ రీజనల్ కార్యాలయంలో కన్వీనర్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూలే చిత్రపటానికి రమణారెడ్డి, ఎస్టీయూ నాయకులు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీయస్ కన్వీనర్ సుబ్రమణ్యం, మండల నాయకులు పుల్లయ్య, జయరామిరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు, రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య, బాషా, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.